సాక్షి
# యాదాద్రి భువనగిరి
సోమవారం, 13, మార్చి, 2023




**జర్నలిజం.. సామాజిక బాధ్యత**
జర్నలిజం ఉద్యోగం కాదు.. సామాజిక బాధ్యత అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. - 10లో



**అభిప్రాయ సేకరణ తర్వాతే..**
ఫార్మా కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయం సేకరించిన తర్వాతే అనుమతులు ఇవ్వాలని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
35°/18°
**వాతావరణం**
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


చంద్రశేఖర్

భువనగిరి : కర్నాటక రాష్ట్రంలోని ఉడిపిలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి అండర్ -18 2 వేల మీటర్ల స్టీపుల్ చేజ్ విభాగంలో తుర్కపల్లి మండలం రాంపూర్ తండాకు చెందిన బానోతూ చంద్రశేఖర్ తృతీయ స్థానంలో నిలిచి అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయ్య, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, కోనేటి గోపాల్ అభినందించారు.

### ఆశ వర్కర్లపై పనిభారం తగ్గించాలి


మాట్లాడుతున్న కల్లూరి మల్లేశం

భువనగిరిటౌన్ : ఆశ వర్కర్లపై పని భారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన ఆశ వర్కర్లు యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. ఆశ వర్కర్లకు వివిధ రకాల సర్వేల పేరుతో డ్యూటీలు వేస్తున్నారని, దానికి సంబంధించిన డబ్బులు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశలకు సెలువు వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో ఆశ కార్యకర్తలు పల్లెపాటి జ్యోతి, పుష్ప, పావని, సుజాత, ప్రమీళ, అయిలమ్మ, అనిత, జయమ్మ, పావని తదితరులు ఉన్నారు.

### ప్రజల దృష్టి మళ్లించడానికే 'బండి'పై విమర్శలు


మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రావు

సాక్షి, యాదాద్రి : మద్యం పాలసీ కేసులో ఈడీ విచారణను ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితపై నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే బీఆర్‌ఎస్ శ్రేణులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై విమర్శలు చేస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన భువనగిరిలో విలేకరులతో మాట్లాడారు. గవర్నర్‌ను దూషించిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి, మహిళా సర్పంచ్‌ను వేధించిన ఎమ్మెల్యే రాజయ్యపై మహిళా కమిషన్ ఎందుకు విచారణ చేపట్టలేదని ఆయన ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నాయకులకు, మహిళా కమిషన్ కేవలం సంజయ్ అన్న తెలుగు నానుడిని వక్రీకరించి నానా యాగి చేస్తున్నారన్నారు.ఈడీ కవితను విచారణకు పిలువడంతోనే బీఆర్‌ఎస్ శ్రేణులు సంజయ్ మాటలను రెండు రోజుల తర్వాత వెలుగులోకి తెచ్చారన్నారు. బండి సంజయ్ మాటలను వక్రీకరించడం మానుకోవాలన్నారు. అలాగే బండి సంజయ్‌పై కొందరు బీఆర్‌ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. మహిళా కమిషన్ రాజయ్య, కౌశిక్ రెడ్డి మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంటే బీఆర్‌ఎస్ నాయకులు తట్టుకోలేక బండిసంజయ్‌ను టార్గెట్ చేసి విమర్శలు చేయడం సరికాదన్నారు.

### బండి సంజయ్‌పై ఫిర్యాదు


ఎస్‌ఐకి ఫిర్యాదు ఇస్తున్న నాయకులు

సంస్థాన్ నారాయణపురం: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఎస్‌ఐ యుగంధర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు సురేష్, శ్రీకాంత్, రమేష్, నరేష్, సుకుమార్‌రెడ్డి, శ్రీకాంత్, శిధర్ పాల్గొన్నారు.

### హైవేపై ట్రాఫిక్ జామ్

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో ఆదివారం 65వ నంబర్ జాతీయ రహదారిపై విజయవాడ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అప్పటికే రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న విజయవాడ మార్గంలో ఓ వాహనం మరమ్మతులకు గురయ్యింది. దీంతో అటు వైపు వాహనాలు స్తంభించాయి. సుమారు గంట పాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## యాదాద్రిలో సంప్రదాయ పూజలు


యాదగిరిగుట్ట : స్వయంభూ యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలు విశేషంగా జరిగాయి. వేకువజామునే ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం చేపట్టారు. అనంతరం స్వయంభూ పంచనారసింహులకు బిందెతీర్థం, ఆరాధన, బాలభోగం నిర్వహించి, నిజాభిషేకం జరిపి సహస్రనామార్చన విశేషంగా చేపట్టి, తుల సీదళాలతో అర్చించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలు విశేషంగా జరిపించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో వేద ఆశీర్వచనం పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో నిత్యకల్యాణంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.



స్వామివారికి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు, పాల్గొన్న భక్తులు

## ఆధ్యాత్మిక నగరికి మరిన్ని హంగులు

**గుట్ట అభివృద్ధికి ప్రణాళికలు**
- రెండు చోట్ల జంక్షన్ల ఏర్పాటు
- అన్ని వార్డుల్లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.54 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు
- ఇప్పటికే టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.4కోట్లు మంజూరు


యాదగిరిగుట్ట పట్టణ వ్యూ

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. యాదాద్రి ఆలయాన్ని సీఎం కేసీఆర్ అభివృద్ధి చేశారని.. ఇక యాదగిరిగుట్ట మున్సిపాలిటీని తాను అభివృద్ధి చేస్తానని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా అధికారులు పట్టణంలోని సమస్యలను గుర్తించి రూ.54 కోట్లతో ప్రాతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి ఇప్పటికే టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.4కోట్లు మంజూరయ్యాయి.

**మున్సిపాలిటీలో ఇలా..**
2018కి ముందు యాదగిరిగుట్ట మేజర్ పంచాయతీగా కొనసాగింది. పరిపాలన సౌలభ్యం, యాదాద్రి ఆలయం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో 2018 ఆగస్టు 2న యాదగిరిగుట్ట మేజర్ గ్రామపంచాయతీని ప్రభుత్వం మున్సిపాలిటీగా ప్రకటించింది. ప్రస్తుతం మున్సిపాలిటిలో 25వేలకు పైగా జనాభా నివసిస్తుండగా.. 5500గృహాలు ఉన్నాయి. ఇక్కడ 12 వార్డులు, 15కు పైగా కాలనీలు ఉన్నాయి. ఇక్కడ ఉన్న జనాభాతో పాటు నిత్యం యాదాద్రి క్షేత్రానికి భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిని దృష్టిలో పెట్టుకొని పట్టణాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

**ఇటీవల రూ.4 కోట్లు మంజూరు**
యాదగిరిగుట్ట మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా గతంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) కింద రూ.20కోట్లు మంజూరు చేశారు. ఇందులో రూ.16కోట్లను అప్పుడు విడుదల చేయడంతో యోగానంద నిలయం పక్క నుంచి బీసీ కాలనీ చివరి వరకు భారీ ఓపెన్ డ్రెయినేజీకి మరమ్మతులు చేయడంతో పాటు ఆయా వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేశారు. ఇక ఇందులో పెండింగ్‌లో ఉన్న రూ.4కోట్లను ఇటీవలనే 4 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, 1.4కిలో మీటర్లు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు విడుదల చేశారు. ఈ నిధుల్లోనే గుట్ట ప్రధాన రహదారి పక్కన, పాత గుట్ట ఆలయంలో జంక్షన్ ఇంప్రూమెంట్ కోసం కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు.

**విలీన ప్రాంతాల అభివృద్ధికి..**
మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేయాలనే ఆలోచనతో మంత్రి కేటీఆర్ ఆదేశాలు, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత సూచనలతో చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, కమిషనర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు ఇటీవల ఆయా వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. 12వార్డుల్లో ప్రధానంగా సీసీరోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాలు వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని గుర్తించారు. పట్టణంతో పాటు మున్సిపాలిటీలో వీలినమైన పాతగుట్ట ప్రాంతాలను అభివృద్ధి చేసే విధంగా రూ.54కోట్లతో అధికారులు ఇటీవల ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి ద్వారా ప్రతిపాదనలు పంపించారు. ఈ నిధులు వస్తే పట్టణ రూపు రేఖలు మారనున్నాయి.

**పట్టణ సుందరీకరణకు ప్రణాళికలు**



"యాదగిరిగుట్ట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఇటీవల మంత్రి కేటీఆర్ ఆదేశాలతో పట్టణ సుందరీకరణకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించారు. ఇందులో రూ.54కోట్లు అవసరమని భావించి, తయారు చేసిన ప్రణాళికను విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డికి అందజేశారు. ఇక టీయూఎఫ్ఐడీసీ కింద రూ.4కోట్లు సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీల నిర్మాణానికి, అంతేకాకుండా మున్సిపల్ నూతన భవనానికి రూ.3.2కోట్లు నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే ఈ నిధులు విడుదల అయితే పట్టణంలో పనులు చేపడతాం.
–శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

**మున్సిపల్ భవనానికి రూ.3.2 కోట్లు**
ప్రస్తుతం ఉన్న మున్సిపాలిటీ భవనాన్ని 1963లో నిర్మించడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో సుమారు అర ఎకరం స్థలంలో ఉన్న యాదగిరిగుట్ట మున్సిపాలిటీ భవనాన్ని యాదాద్రి ఆలయ నమూనా ప్రకారం నిర్మించనున్నారు. ఈ భవన నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల రూ.3.2కోట్లను కేటాయించింది. గతంలోనే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ గుట్ట మున్సిపాలిటీని ఆధ్యాత్మిక హంగులతో నిర్మించాలని అధికారులను ఆదేశించారు. దీంతో అప్పట్లోనే ఈఎన్‌సీ రవీందర్‌రావు ఆధ్వర్యంలో అధికారులు సైతం స్థల పరిశీలన చేశారు. త్వరలోనే ఈ భవనం నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## నంబర్ ప్లేట్ లేని వాహనాలపై కొరడా

- పోలీసుల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు
- తొలిరోజు 124 కేసులు నమోదు
- నిరంతరం కొనసాగనున్న ప్రక్రియ


భువనగిరి పట్టణంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

భువనగిరి : నంబర్ ప్లేట్ లేని వాహనాలపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. నేరాల నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను వెంటనే గుర్తించడం, కాలం చెల్లిన వాహనాలను రోడ్లపై తిరగకుండా చేసేందుకు భువనగిరి జోన్‌లోని 17 మండలాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం నుంచి ప్రత్యేక డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగనుంది. ఇకనుంచి జిల్లాలోని అన్ని మండాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రధాన కూడళ్లతో పాటు ప్రధాన రహదారులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండో ప్రాధాన్యత కింద నాలుగు చక్రాల వాహనాలను తనిఖీ చేయనున్నారు.

**మొదటి రోజు..**
భువనగిరి జోన్ పరిధిలో తొలిరోజు నంబర్ ప్లేట్, నంబర్ సక్రమంగా లేని, నంబర్ ట్యాంపర్డ్ కలిగిన, నంబర్ తుడిపివేసిన వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మొదటి రోజు 124 కేసులు బుక్ చేసి 184 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ వాహన యజమానితోనే నంబర్ సరి చేయించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

**జరిమానా విధిస్తున్నారని..**
జిల్లాలో ప్రస్తుతం భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్టలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ పోలీసులు హెల్మెంట్ లేకుండా వాహనాలు నడపడం, పరిమితికి మించి వాహనంపై వెళ్లడంతో జరిమానాలు విధిస్తున్నారు. దీంతో చాలా వరకు వాహనదారులు జరిమానాల నుంచి తప్పించుకునేందుకు రిజిస్ట్రేషన్ అయి ఉన్నప్పటికీ కొంతమంది వాహనదారులు నంబర్ ప్లేట్‌ను తొలగించడం, ఉన్న నంబర్ ప్లేట్‌ను తిప్పివంచడం, నంబర్ తుడిపివేయడం చేస్తున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని కొంత మంది దొంగతనాలకు పాల్పడినప్పుడు నంబర్ లేని వాహనాలను ఉపయోగిస్తున్నారు. దీంతో చోరీలకు పాల్పడిన వారిని గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. దీనికి తోడు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను గుర్తించడం కూడా కష్టంగా మారుతోంది. దీంతో నేరాలను నియంత్రించడంతో పాటు రోడ్డు ప్రమాదాలకు గురైన వారిని గుర్తించేందుకు భువనగిరి జోన్ పరిధిలోని అన్ని మండలాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

**చట్టపరమైన చర్యలు తీసుకుంటాం**



"మోటార్ వెహికిల్ చట్టం -1988 నిబంధనల ప్రకారం వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలతో పాటు నంబర్ ప్లేట్ ఉండాలి. తనిఖీల సమయంలో వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా రోడ్లపై తిరుగుతున్నప్పుడు పట్టుబడితే సెక్షన్ 420 ఐపీసీ కింద కేసు బుక్‌చేసి చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. తనిఖీల సమయంలో వాహనాదారులు సహకరించాలి. వాహనాల తనిఖీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.
– రాజేష్‌చంద్ర, డీసీపీ

### నేరాల నియంత్రణకే స్పెషల్ డ్రైవ్


వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీసీపీ

బీబీనగర్/తుర్కపల్లి : నేరాల నియంత్రణకే వాహనాల తనిఖీలు చేపట్టినట్లు డీసీపీ రాజేష్‌చంద్ర తెలిపారు. ఆదివారం గూడూరు టోల్ ప్లాజా వద్ద, తుర్కపల్లి మండలంలోని మాధాపూర్ వద్ద ఏసీపీ నర్సింహారెడ్డితో కలిసి వాహనాల తనిఖీలను పరిశీలించారు. అనంతరం నంబర్ ప్లేట్ లేని, హెల్మెంట్ లేకుండా ప్రయానిస్తూ పట్టుబడిన వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బీబీనగర్‌లో నంబర్ ప్లేట్ లేకుండా నడిపిస్తున్న పది బైక్‌లను సీజ్ చేశారు. ఆయన వెంట సీఐలు వెంకటయ్య, సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు సైదులు, రాఘవేందర్‌గౌడ్ ఉన్నారు.

## బస్తీ దవాఖానాలు సిద్ధం

- నేటి నుంచి అందుబాటులోకి సేవలు
- ఇప్పటికే వైద్య సిబ్బంది నియామకం



తారాకరామానగర్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బస్తీ దవాఖానా


భువనగిరి : భువనగిరి పట్టణ వాసులకు వైద్య సేవలు అందించేందుకు బస్తీ దవాఖానాలు సిద్ధమయ్యాయి. భువనగిరికి మూడు మంజూరు కాగా, ఒక్కో బస్తీ దవాఖాన ఏర్పాటుకు 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.13 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. ఈ నిధుల ద్వారా పట్టణంలోని తారకరామానగర్, సంజీవనగర్, బ్రాహ్మణవాడ తదితర ప్రాంతాల్లో దవాఖానాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే దవాఖానాల్లో వైద్య సిబ్బందిని కూడా నియమించారు. ఇందులో ఒక మెడికల్ ఆఫీసర్‌తో పాటు స్టాఫ్‌నర్స్, అంటెండర్ ఉంటారు. ఈ దవాఖానాలో కేవలం ఓపీ సేవలు మాత్రమే అందించనున్నారు. మొత్తం 108 రకాల మందులు అందిస్తారు. రోగుల పరిస్థితిని బట్టి జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేస్తారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలను అందించనున్నారు. పట్టణంలో బస్తీదవాఖానాలను సోమవారం ప్రారంభించేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు.

### 17 నుంచి జనచైతన్య యాత్రలు

చిట్యాల : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 17వ తేదీ నుంచి సీపీఎం ఆధ్వర్యంలో జన చైతన్య యాత్రలను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు తెలిపారు. చిట్యాలలో ఆదివారం జరిగిన ఆ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ, సామాన్యులపై భారం మోపోతోందన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజా చైతన్య యాత్రలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, మేక అశోక్‌రెడ్డి, అవిశెట్టి శంకరయ్య, అర్రూరి శ్రీను, జిట్ట సరోజ, బొడ్డుపల్లి వెంకటేష్, చెర్కు పెద్దులు, పామనగుళ్ల అచ్చాలు, మల్లం మహేష్, నారబోయిన శ్రీనివాసులు, శీలా రాజయ్య, రుద్రారపు పెద్దులు, ఐతరాజు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## పురుషులతో సమానంగా మహిళలు రాణించాలి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ సునీత

గుండాల : తాము ఎంచుకున్న రంగంలో పురుషులతో సమానంగా మహిళలు రాణించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని బండకొత్తపల్లి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కృషిచేస్తుందన్నారు. మహిళల కోసం నిర్భయ చట్టం షీటీమ్స్‌తో పాటు ఎన్నో బృహత్తర కార్యక్రమాలను ప్రభుత్వం చేపటినట్లు తెలిపారు. అనంతరం కేక్ కట్‌చేసి మహిళలతో కలిసి నృత్యం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తాండ్ర అమరావతి జెడ్పీటీసీ కోలుకొండ లక్ష్మి, సర్పంచ్ గోపాల్‌దాస్, భిక్షమమ్మ, తోటకూరి రాధిక, రేఖ, సువర్ణ పాల్గొన్నారు.

## కలవరపెడుతున్న 'కోనోకార్పస్'

- హరితహారంలో భాగంగా విరివిగా కోనోకార్పస్ మొక్కల పెంపకం
- వీటి పుప్పొడితో శ్వాసకోశ వ్యాధులు వస్తాయని వైద్యుల హెచ్చరిక
- ప్రాణాంతకమని తెలిసినా పట్టించుకోని అధికారులు



రామన్నపేటలోని వైకుంఠధామంలో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

రామన్నపేట : మానవాళి మనుగడకు, పర్యావరణానికి ముప్పుగా పరిణమించిన కోనోకార్పస్ చెట్లను జిల్లాలో విస్తారంగా పెంచుతున్నారు. పక్షి వాలని, మనిషిని మింగే మానుగా పిలువబడుతున్న కోనోకార్పస్ చెట్ల పెంపకానికి హరితహారం నిధులను వెచ్చిస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఈ మొక్కలతో సకల ప్రాణులకు పర్యావరణానికి ముప్పు ఉందని నిపుణులు, పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**అప్పుడు ఆనందం...ఇప్పుడు ఆందోళన**
రాష్ట్ర ప్రభుత్వం పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామనర్సరీల నిర్వహణ, విత్తనాలు, మొక్కలు కొనుగోలు, నీళ్ల పోయించడం వంటి తదితర ఖర్చులకు పంచాయతీ నిధులలో పదిశాతం వాడుకునే వెసులుబాటు కల్పించింది. తొందరగా, ఏపుగా పెరగడంతోపాటు అందంగా ఉంటాయనే ఆశతో ప్రజాప్రతినిధులు, అధికారులు పల్లెపట్టణ ప్రగతి కార్యక్రమంలో ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్లకు ఇరువైపులా, వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాలలో కోనోకార్పస్ మొక్కలను విరివిగా నాటారు. ఇతర రాష్ట్రాల్లోని నర్సరీల నుంచి ఒక్కో మొక్కను రూ. 80 నుంచి రూ.120 వరకు ఖర్చుచేసి కొనుగోలు చేశారు. వరంగల్ జాతీయ రహదారి, ఇతర ప్రధానరోడ్లతోపాటు నివాసగృహాల మధ్య ఈ మొక్కలను నాటారు. ఏడాదిలోపే మొక్కలు ఏపుగా పెరిగాయి. వాటి సంరక్షణకు పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. కింది కొమ్మలను కత్తిరిస్తూ అందంగా తీర్చిదిద్దుతున్నారు. రోడ్ల వెంట అందంగా కనిపించడంతో ప్రారంభంలో జనం సంతోషపడ్డారు. ప్రమాదమనే విషయం వెలుగులోకి వచ్చిన తరువాత ఆందోళనకు గురవుతున్నారు.

**అన్ని విధాలా అనర్థమే..**
కోనోకార్పస్ చెట్లు సముద్ర తీరాల్లో పెరుగుతాయి. నదులు సముద్రాల్లో కలిసేచోట నేల కోతకు గురికాకుండా చెట్లను పెంచుతారు. కోనోకార్పస్ చెట్ల నుంచి వచ్చే పుప్పొడి అత్యంత ప్రమాదకరమని, ఆ చెట్ల నుంచి పీల్చుకునే గాలి అనారోగ్యకరమని, శ్వాసకోశ సంబంధమైన వ్యాధులు వస్తాయని పర్యావరణవేత్తలు, డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. మొక్కల వేర్లు చాలా లోతువరకు వెళ్లి భూగర్భజలాలను పీల్చడమే కాకుండా వాటర్, కేబుల్ పైప్‌లైన్లను దెబ్బతీస్తాయి. ఇటీవల అటవీశాఖ వారు కోనోకార్పస్ మొక్కల పెంపకాన్ని నిషేధించారు. కానీ ఇప్పటికే నాటి ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించి వాటిస్థానంలో ఆరోగ్యంతోపాటు ఆక్సీజన్, నీడను ప్రసాధించే చెట్లను నాటే విషయంలో నిర్లక్ష్యం చేస్తుందనే ఆరోపణలు ఉన్నాయి.

**అధికారిక ఉత్తర్వుల మేరకే తదుపరి చర్యలు**
కోనోకార్పస్ చెట్ల విషయంలో ప్రజలు ఆందోళన చెందుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వాటిని తొలగించే విషయంలో అధికారికంగా ఏ విధమైన ఉత్తర్వులు రాలేదు. అధికారిక ఉత్తర్వుల ప్రకారమే తదుపరి చర్యలు ఉంటాయి.
– శోభారాణి, జిల్లా అటవీశాఖ అధికారిణి

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


లింగమయ్య (ఫైల్)

మోటకొండూర్: మండల పరిధిలోని కాటేపల్లి గ్రామ శివారులో ఆదివారం ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చామాపూర్ గ్రామానికి చెందిన రాయగిరి లింగమయ్య(55), సాయిలు బైక్‌పై గ్రామం నుంచి మాదాపురం వెళ్తున్నారు. అదే సమయంలో ఆత్మకూరు(ఎం) మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మహేందర్ కారులో రాయిగిరి నుంచి ఇంటికి వస్తుండగా.. మార్గమధ్యలో కాటేపల్లి శివారులో కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లింగమయ్య, సాయిలును స్థానికులు భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ లింగమయ్య మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్ తెలిపారు.

### వైద్యం వికటించి గర్భిణి మృతి

సూర్యాపేట క్రైం: వైద్యం వికటించి గర్భిణి మృతిచెందిన ఘటన ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం మున్యానాయక్ తండాకు చెందిన బాణోతు పద్మ(28) రెండు నెలల గర్భిణి. శనివారం జిల్లా కేంద్రంలోని ఏకశిల నర్సింగ్ హోంలో వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చింది. ఇంటికి వెళ్లిన తర్వాత అర్ధరాత్రి పద్మ మృతిచెందింది. కాగా వైద్యం వికటించడంతోనే తన భార్య మృతిచెందిందని పద్మ భర్త బికారి, బంధువులు ఆదివారం ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని ఆస్పత్రి నిర్వాహకులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

### సాగర్‌లో పర్యాటకుల సందడి


మహాస్థూపంలో ప్రవచనాలు వింటున్న పర్యాటకులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. లాంచీలలో పర్యాటకులు నాగార్జునకొండకు వెళ్లి అక్కడ మ్యూజియంలో భద్రపరిచిన బుద్ధుడి విగ్రహాలను సందర్శించారు. సాయంత్రం బుద్ధవనంలోని మహాస్థూపంలో ఇండియన్–థాయ్ బౌద్ధ భిక్షువు అరుణో బౌద్ధ దమ్మ ఇచ్చిన ప్రవచనాలను విన్నారు.

### ఘనంగా ఊరేగింపు


పల్లకీలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

మోతె: మండల పరిధిలోని ఉర్లుగొండ గ్రామంలో ఆదివారం శ్రీశ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర ఘనంగా జరిగింది. జాతరలో భాగంగా స్వామివారిని కొండపై నుంచి దించి గరుడ వాహనంపై ఉర్లుగొండ, కరక్కాయలగూడెం, అన్నారిగూడెం, సర్వారం గ్రామాల్లో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో స్వామివారి సన్నిధిలో భక్తులకు అన్నదానం చేశారు.

# పశువుల సంతలో వ్యాపారిపై దాడి

- అడిగినంత ధరకు కోడె దూడను ఇవ్వనందుకు కర్రతో కొట్టిన వ్యక్తి
- వ్యాపారి తప్పించుకోవడంతో కోడె దూడకు కర్ర తగిలి మృతి
- సంత గేటుకు తాళం వేసి ఆందోళన


రోడ్డుపై ధర్నా చేస్తున్న బాధితుడు, అతడి తరఫు బంధువులు


మృతిచెందిన కోడె దూడ

కోదాడరూరల్: అడిగినంత ధరకు కోడె దూడను ఇవ్వలేదనే కోపంతో పశువుల సంతలో వ్యాపారిపై ఓ వ్యక్తి కర్రతో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో సదరు వ్యాపారి తప్పించుకోగా కోడె దూడకు కర్ర తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ సంఘటన కోదాడ పశువుల సంతలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. హుజూర్‌నగర్‌కు చెందిన బత్తుల అంజయ్య కోదాడ సంతలో పశువులను అమ్మేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో అంజయ్య వద్ద ఉన్న కోడె దూడని సంతలో వ్యాపారం చేసే అక్బర్ తనకు రూ.10వేలకు విక్రయించాలని అడిగాడు. ఆ ధరకు దూడ రాదని, అయినా ఇది రైతులకు విక్రయించేదని, దాని ధర రూ.40వేల నుంచి రూ.50వేలు ఉంటుందని అంజయ్య తెలిపాడు. దీంతో కోపోద్రిక్తుడైన అక్బర్ ‘నాకే రేటు ఎక్కువ చెప్తావా.. అడిగిన ధరకు ఇవ్వవా’ అంటూ అంజయ్యను దుర్భాషలాడుతూ కర్రతో దాడికి పాల్పడ్డాడు. గాయాలపాలైన అంజయ్య తప్పించుకునే ప్రయత్నం చేయగా, కోడె దూడ తలపై కర్ర బలంగా తగలడంతో అది అక్కడికక్కడే మృతిచెందింది. వీరికి అడ్డుగా వచ్చిన మరొకరిపై కూడా అక్బర్ దాడికి పాల్పడి అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు.

**బంధువులు, వ్యాపారులతో కలిసి..**

అంజయ్యపై దాడి జరిగిన విషయంతో పాటు కోడె దూడ మృతిచెందిన విషయం తెలుసుకున్న అతడి తరఫు బంధువులు, మరికొందరు వ్యాపారులు సంత గేటుకు తాళం వేసి కోదాడ–హుజూర్‌నగర్ రోడ్డుపై మృతిచెందిన కోడె దూడను ఉంచి ఆందోళనకు దిగారు. తమపై అక్బర్ దాడి చేయడం ఇది మొదటిసారి కాదని, గతంలో కూడా ఇదేవిధంగా చేసి తప్పయ్యిందని ఒప్పుకున్నాడని పలువురు వ్యాపారులు తెలిపారు. సంతలో వ్యాపారం కోసం వచ్చే తమపై దాడులకు పాల్పడం ఏమిటని రోడ్డుపై బైఠాయించారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. సంతలో కొందరు ఇష్టానుసారంగా వ్యవహరించడమే కాకుండా రౌడీల్లా ప్రవర్తిస్తున్నారని, వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మృతిచెందిన కోడు దూడకు పశువైద్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. బాధితుడు అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్బర్‌పై కేసు నమోదు చేసినట్లు కోదాడ పట్టణ పోలీసులు తెలిపారు.

# యాదాద్రిలో భక్తుల రద్దీ


స్వామివారి దర్శనానికి ప్రధానాలయ ముఖ మండపంలో బారులుదీరిన భక్తులు

- 35వేల మందికి పైగా రాక
- ధర్మదర్శనానికి మూడున్నర గంటల సమయం
- పూజల ద్వారా నిత్యాదాయం రూ.50.64 లక్షలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాదం విక్రయశాల, కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, ఘాట్ రోడ్డు భక్తులతో కిక్కిరిశాయి. 35వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ధర్మదర్శనాకి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. మండుటెండకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. వివిధ పూజల ద్వారా స్వామివారికి నిత్యాదాయం రూ.50,64,604 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

**కొండపై ఎండతో భక్తులకు కష్టాలు**

యాదాద్రి కొండపై స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు వేసవి కష్టాలు తప్పడం లేదు. రోజురోజుకు ఎండలు ఎక్కువవుతుండడంతో కొండపై చలువ పందిళ్లు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కొండపై పలువురు భక్తులు ఎండకు పాదాలు కాలుతుండటంతో నీడ కోసం పరుగులు పెట్టారు. స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న మహిళలు, చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు.


ప్రసాదం కౌంటర్ల వద్ద కిక్కిరిసిన భక్తులు


ఎండకు తాళలేక ఆలయ పిల్లర్ల నీడలో కూర్చున్న భక్తులు

# మనస్తాపంతో రైతు ఆత్మహత్య

- ఇంటి విషయమై వేధింపులు భరించలేక కలుపు మందు తాగి..
- విషయం బయటకు రాకుండా సెటిల్మెంట్‌కు ప్రయత్నిస్తున్న పెద్ద మనుషులు


లింగయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సూర్యాపేట క్రైం: ఇంటి విషయంలో వేధింపులు భరించలేక కలుపు మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రిలో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లలమర్రి గ్రామానికి చెందిన రైతు వుల్లెందుల లింగయ్య 20 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో హౌజింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న మాదగోని చంద్రయ్యగౌడ్ దగ్గర ఇంటి స్థలాన్ని అప్పటి మార్కెట్ రేటు ప్రకారం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్నాడు. కాగా తాను అమ్మినదాని కంటే ఎక్కువ స్థలంలో ఇల్లు నిర్మించుకున్నావని గత కొంతకాలంగా లింగయ్యను చంద్రయ్య వేధిస్తున్నాడు. గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టించి రూ.11లక్షలు ఇవ్వాలని చంద్రయ్య డిమాండ్ చేయగా, పెద్ద మనుషులు రూ.6లక్షలు ఇవ్వాలని తీర్మానం చేశారు. కానీ దీనికి లింగయ్య ఒప్పుకోలేదు. లింగయ్య కొడుకు రాజుకు శుక్రవారం చంద్రయ్య ఫోన్ చేసి ఆదివారం రోజు డబ్బు చెల్లించాలని లేకపోతే ఇంటి గోడ కూల్చి స్థలాన్ని తీసుకుంటానని బెదిరించాడు. ఈ విషయం తెలుసుకున్న లింగయ్య మనస్తాపానికి గురై ఆదివారం ఉదయం 5గంటలకు పొలం దగ్గరకు వెళ్లి కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా లింగయ్య ఆత్మహత్య చేసుకునే ముందు రోజు గ్రామానికే చెందిన బొల్లం సైదులుతో మాట్లాడుతూ.. తనను చంద్రయ్య బెదిరిస్తున్నాడని, తనకు చావే శరణ్యమని చెప్పినట్లు తెలుస్తోంది. తన మృతికి చంద్రయ్యే కారణమని లింగయ్య సూసైడ్ నోట్ రాసినట్లు గ్రామస్తులు గుర్తించారు. కానీ కొంతమంది ఈ విషయం బయటకు రాకుండా సెటిల్మెంట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. చంద్రయ్య వేధింపులు తాళలేకే లింగయ్య ఆత్మహత్య చేసుకున్నాడని, చంద్రయ్యను అరెస్టు చేయాలని లింగయ్య కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

### అధిక వడ్డీ ఆశచూపి మోసం

- బాధితుల ఆందోళన

దేవరకొండ: అధిక వడ్డీ పేరుతో ముగ్గురు వ్యక్తులు దేవరకొండ పట్టణంలో చిరు వ్యాపారాలు నిర్వహించే వారి వద్ద నుంచి సుమారు రూ.3కోట్ల మేర వసూలు చేశారు. అందులో ఒకరు పట్టణానికే చెందిన వ్యక్తి కాగా, ఆదివారం తమ డబ్బులు తిరిగి చెల్లించాలని పలువురు బాధితులు సదరు వ్యక్తి ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. తాము చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారంలో రూ.లక్ష పెట్టుబడి పెడితే ప్రతి నెలా అదనంగా రూ.40వేలు చెల్లిస్తామంటూ నమ్మబలికి తమను మోసం చేశారని బాధితులు ఆరోపించారు. రోజు వారి కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న తాము ఇతరుల వద్ద కూడా డబ్బులు తీసుకొచ్చి సదరు వ్యక్తులకు ఇచ్చామని, బంగారం సైతం అమ్మి నగదును ఇచ్చామని పలువురు పేర్కొన్నారు. కొన్ని నెలలుగా తమ డబ్బులను తిరిగి చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న దేవరకొండ ఎస్‌ఐ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సదరు వ్యక్తి రెండు రోజుల్లో డబ్బులు తిరిగి చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కాగా ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

### చిన్నారులను విక్రయిస్తున్న ముఠా సభ్యురాలి అరెస్ట్?

కోదాడరూరల్: చిన్నారులను విక్రయిస్తున్న ఓ ముఠా సభ్యురాలిని మహారాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కోదాడ మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన మహిళ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న సమయంలో మహారాష్ట్రకు చెందిన ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. వీరితో పాటు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరికొంత మంది కలిసి మహారాష్ట్రలోని ముంబై ప్రాంతంలో ఆర్థిక ఇబ్బందులో ఉన్న వారిని గుర్తించి వారితో బేరం మాట్లాడుకొని పిల్లలను కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. వీరు కొద్దిరోజుల క్రితం పెన్‌పహాడ్ మండలంలోని ఓ గ్రామంలో నాలుగేళ్ల బాలుడిని రూ.4లక్షలకు విక్రయించినట్లు సమాచారం. ఇలాంటి కేసులను ఛేదిస్తున్న క్రమంలో మహారాష్ట్ర పోలీసులు గణపవరం గ్రామానికి చెందిన మహిళను స్థానిక పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

# యాదాద్రీశుడి సేవలో ప్రముఖులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఆదివారం ఎమ్మెల్సీ దయానంద్, గుజరాత్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి హరేష్ దూదత్ వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు వీరికి సాంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.


ఎమ్మెల్సీ దయానంద్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

# క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి


రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జున సాగర్): క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని బోయగూడెంలో నిర్వహిస్తున్న గంగమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ తల్లుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి ఏర్పాటు చేసిన రెండు తెలుగు రాష్ట్రాల మహిళా కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామపంచాయతీలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కబడ్డీ పోటీలను తిలకించడానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. కాగా ఆదివారం సాయంత్రం ఉమ్మడి నల్లగొండ జిల్లా పురుషుల కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్, వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ నెమలి సునితాకృష్ణారెడ్డి, పెద్దవూర ఎంపీపీ గౌరవ సలహాదారుడు చెన్ను సుందర్‌రెడ్డి, నాయకులు అల్లి పెద్దిరాజు, బొల్లేపల్లి రమణరాజు, కేశావత్ రామకృష్ణనాయక్, కూన్‌రెడ్డి లింగారెడ్డి, సాయిరెడ్డి, మురళి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇళ్లలో చోరీ

- ఏడు తులాల బంగారం, రూ.2.10లక్షల నగదు అపహరణ


చిందరవందరగా బీరువాలోని వస్తువులు

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో గల భరత్‌నగర్‌లో రెండు ఇళ్లల్లో చోరీ జరిగిన విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భరత్‌నగర్‌లో నివాసముంటున్న కుంచెం నరేశ్ శనివారం హైదరాబాద్‌లోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఇంట్లో దాచిన ఐదు తులాల బంగారం, రూ.10వేల నగదు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. అదేవిధంగా పక్క వీధిలో నివాసముంటున్న దేవరశెట్టి లక్ష్మయ్య శనివారం తన సొంత ఊరికి వెళ్లి ఆదివారం తిరిగివచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో పాటు ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా రెండు తులాల బంగారం, రూ.2లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలాన్ని క్లూస్ టీం సభ్యులు పరిశీలించి వేలిముద్రలు తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

# కేవీ సత్యనారాయణ సహకారం మరువలేనిది

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి


కేవీ సత్యనారాయణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కుందూరు జానారెడ్డి

హాలియా: తాను రాజకీయంగా ఉన్నత స్థాయిలో ఉండటానికి తన రాజకీయ గురువు కేవీ సత్యనారాయణ అందించిన సహకారం మరువలేనిదని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. హాలియాలో ఏర్పాటు చేసిన కేవీ సత్యనారాయణ విగ్రహాన్ని ఆదివారం మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డితో కలిసి జానారెడ్డి ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం స్థానిక చైతన్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కేవీ సత్యనారాయణ ఆత్మీయ సంస్మరణ సభలో వారు పాల్గొని మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అనేక సంస్కరణలను ఆద్యుడు కేవీ సత్యనారాయణ అన్నారు. ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ సంస్థాగత నిర్మాణంలో కేవీ సత్యనారాయణ చురుకుగా పాల్గొని మండల వ్యవస్థ, స్త్రీలకు ఆస్తి హక్కు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడం వంటి వాటికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, మాజీ జెడ్పీ చైర్మన్ సీడీ రవికుమార్, గడ్డం భాస్కర్‌రెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, ముడ్వా అరుణ్‌కుమార్, కుందూరు వెంకట్‌రెడ్డి, బాబురావు నాయక్, బ్రహ్మానందరెడ్డి, యడవెల్లి నరేందర్‌రెడ్డి, మిట్టపల్లి వాసులు, కుందూరు వీర కోటిరెడ్డి, శంకర్‌నాయక్, కౌన్సిలర్లు ఉన్నారు.

### డంపింగ్ యార్డులా జాతీయ రహదారి !


అర్వపల్లి శివారులో హైవే పక్కన పడేసిన వ్యర్థాలు

అర్వపల్లి: చెత్త, వ్యర్థ పదార్థాలను ప్రతిరోజు గ్రామపంచాయతీలు చెత్త ట్రాక్టర్ ద్వారా సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్న విషయం తెలిసిందే. కానీ అర్వపల్లిలో కొందరు వ్యాపారులు, ఇళ్ల యజమానులు కోళ్ల వ్యర్థాలు, ఖాళీ కొబ్బరిబోండాలను, చిత్తు కాగితాలు, ఇతర వ్యర్థాలను తుంగతుర్తి వెళ్లే రోడ్డు పక్కన 365బీ హైవే వెంటే కుప్పలుకుప్పలుగా తెచ్చి పోస్తున్నారు. అయితే ఈ వ్యర్థాలపై కోతులు, కుక్కలు చేరి వాటిని చిందరవందర చేస్తూ రోడ్డుపైకి వస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే హైవే వెంట ప్రయాణించే వారికి దుర్వాసన వెదజల్లుతుంది. రోడ్డుపై వ్యర్థాలు పడేయకుండా వ్యాపారులు, ఇళ్ల యజమానులకు అవగాహన కల్పించాలని వాహనదారులు, ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.


# చిత్రలేఖనంలో చిచ్చరపిడుగులు

- రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న కవలలు
- పలు అవార్డులు, మెడల్స్ సొంతం


బొమ్మలు గీస్తున్న ఆధ్య




బొమ్మలు గీస్తున్న ఆర్య



మిర్యాలగూడ టౌన్: పిట్ట కొంచెం.. కూత ఘనం అనే నానుడికి సరిగ్గా సరిపోతారు ఈ కవలపిల్లలు. చిన్న వయసులోనే చిత్రలేఖనంలో రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు, అవార్డులు గెలుచుకున్నారు. వివరాలు.. మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన పేలపోలు ప్రసాద్, భాను దంపతులకు కవలలు ఆధ్య (అమ్మాయి), ఆర్య(అబ్బాయి) సంతానం. ప్రస్తుతం రెండో తరగతి చదువుతున్న వీరికి చిన్న వయస్సులోనే చిత్రలేఖనంపై ఉన్న ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు యినుగర్తి విజయ్‌కుమార్ వద్ద శిక్షణ ఇప్పిస్తున్నారు. దీంతో వీరిద్దరూ కరోనా, ప్రకృతి, సేవ్ నేచర్, సేవ్ వాటర్, పండుగలు, సంస్కృతి, సాంప్రదాయాలపై రెండు వందలకు పైగా బొమ్మలు గీసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు, మిర్యాలగూడ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యేకంగా ఈ కవల పిల్లలను సత్కరించారు. అంతేకాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని పలు అవార్డులు, ప్రశంసాపత్రాలు, మెడల్స్ సైతం గెల్చుకున్నారు.

**ఆధ్య, ఆర్య గెలుచుకున్న అవార్డులు, మెడల్స్..**

- 2020లో మిర్యాలగూడలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ చిత్రలేఖనం పోటీల్లో ఇరువురు పాల్గొని ప్రథమ బహుమతి సాధించారు.
- 2020లో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ రీసెర్చ్, పూణె వారు నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో ఆధ్య ప్రశంసా పత్రం అందుకోగా, ఆర్య మెరిట్‌తో పాటు ప్రశంసా పత్రం దక్కించుకున్నాడు.
- 2021లో శ్రీదర్శిని కళైకూడమ్, చెన్నై వారు నిర్వహించిన యూనివర్సల్ జ్యూరీ పోటీలలో ఆధ్య మెరిట్ అవార్డుతో పాటు సర్టిఫికెట్ సాధించగా, ఆర్య బ్రాంజ్ మెడల్ సాధించాడు.
- 2021లో బెంగుళూరులో నిర్వహించిన కేర్ ఫర్ నేచర్–మదర్ ఎర్త్ చిత్రలేఖనం పోటీలలో ఇరువురు పాల్గొని ప్రశంసా పత్రాలు అందుకున్నారు.
- 2021లో బ్యూటీ ఆఫ్ ఇండియా ఆర్ట్స్ కాంటెస్ట్, హైదరాబాద్ వారు నిర్వహించిన పోటీలలో ఆధ్య మెరిట్ అవార్డు, ఆర్య ప్రశంసా పత్రం అందుకున్నారు.
- 2021లో ఇంజనీయస్ కిడ్స్, హైదరాబాద్ వారు నిర్వహించిన పోటీలలో ఆధ్య మెరిట్ అవార్డు, ఆర్య మెరిట్ అవార్డుతో పాటు సర్టిఫికెట్ అందుకున్నారు.
- 2022లో మారుతీ ఆర్ట్స్ అకాడమీ, గుజరాత్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలలో ఆధ్య సిల్వర్ మెడల్, ఆర్య ప్రశంసా పత్రం దక్కించుకున్నారు.
- 2023లో క్రియేటీవ్ ఆర్ట్స్ అకాడమీ, గుంటూరు వారు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో ఆధ్య బంగారు పతకం సాధించగా, ఆర్య మెరిట్ అవార్డుతో పాటు సర్టిఫికెట్ అందుకున్నాడు.